www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 16 డిసెంబర్ 2023
5
చిత్తూరు

ఎంఎల్‌సి షేక్ సాబ్జి మృతి తీరని లోటు



ప్రజాశక్తి చిత్తూరుఅర్బన్: రోడ్డు ప్రమాదంలో తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి షేక్ సాబ్జి మృతి ఉద్యోగ, ఉపాధ్యాయ కార్మికులకు తీరని లోటని కార్మిక, ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల నేతలు ఎంఎల్‌సి సాబ్జికి నివాళ్లు అర్పించారు. సెమ్మెలో ఉన్న అంగన్వాడీలు, కలెక్టరేట్ ఎదుట పోరాటం చేస్తున్న ఆశాలు షేక్ సాబ్జికి నివాళ్లు అర్పించారు. వికోట మండలంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జివి. రమణ, బైరాల మండలంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు సోమశేఖర్‌నాయుడు పలువురు యుటిఎఫ్ నేతలు, ఉపాధ్యాయులు సాబ్జి చిత్ర పటానికి నివాళ్లు అర్పించారు. ఉద్యమ నేతగా శాసన మండలికి ఎన్నికైన షేక్ జాబ్జి ఉపాధ్యాయ ఉద్యమం కోసం అనేక పోరాటాల్లో పాల్గొన్నారని ఆయన మృతి ఉద్యోగ, ఉపాధ్యాయ కార్మిక వర్గానికి తీరని లోటని యుటిఎఫ్ నేతలు తెలిపారు.

చిత్తూరులో..

నూతమంత్రంగా నిర్వహణ

చంద్రగిరిలో..

బెదిరేది..లే..! తగ్గేది లే..!

సచివాలయ ఉద్యోగులతోనా అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ
మున్సిపల్ కార్మికులు సమ్మె చేస్తే మరుగుదొడ్లు కడిగిస్తారా..?

డిమాండ్లు పరిష్కరించేవరకూ సమ్మె

'ఎన్ని అవరోధాలు ఎదురైనా.. రాష్ట్ర ప్రభుత్వం ఎన్ని అడ్డంకులు సష్టించినా.. ఉద్యోగాలు తొలగిస్తామన్నా..అంగన్వాడి కేంద్రాల తాళాలు బద్దలు కొడతామన్నా.. తొణకం..బెణకం.. మా హక్కులు, హామీలు సాధించుకు తీరుతాం.. స్వతంత్ర భారతంలో, అంబేద్కర్ రాసిన రాజ్యాంగంలో నిరసన ఓ హక్కు.. తగ్గేదెలే.. దాన్ని కాల రాసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కుట్రలు చేయడం అన్యాయం.. సర్కారు బెదిరింపులను, సమ్మె విచ్ఛిన్న చర్యలను ఛేదించి తీరుతాం...ఈ రోజు అంగన్వాడీలు సమ్మె చేస్తున్నారన్న నెపంతో సచివాలయ ఉద్యోగులతో అంగన్వాడి కేంద్రాలు నడుపుతామని చెప్తున్న రాష్ట్ర ప్రభుత్వం రేపు మున్సిపల్ ఉద్యోగులు సమ్మెకు దిగితే వారి చేత మరుగుదొడ్లు కడిగిస్తారా..? సీఎం గారు మీరే గనక సచివాలయ ఉద్యోగుల చేత వారం రోజులు పాటు అన్ని అంగన్వాడి కార్యకలాపాలు సాగిస్తే అంగన్వాడీలమంతా మీరిచ్చే వేతనాలే తీసుకుంటాం.. మీరు చెప్పినట్లే వింటాం' అని అంగన్‌వాడీలు సవాలు విసురుతున్నారు. జగన్ సర్కార్ కు వ్యతిరేకంగా తమ న్యాయపరమైన డిమాండ్ల సాధన కోసం సిఐటియు, ఐఎఫ్టియు అనుబంధ సంఘాల అంగన్వాడిలు చేస్తున్న నిరవధిక సమ్మె నాలుగవ రోజుకు చేరుకుంది.

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

అంగన్వాడీలు నిర్వహిస్తున్న సమ్మె నాలుగో రోజుకు చేరుకుంది. శుక్రవారం ఉదయం పాత మున్సిపల్ కార్యాలయం ముందు రాజీవ్ గాంధీ విగ్రహం సర్కిల్ చుట్టూ మానవహారం నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు తిరుపతి నగర ప్రధాన కార్యదర్శి కే వేణుగోపాల్ మాట్లాడుతూ అంగన్వాడీలు తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం సమ్మెలోకి దిగితే వైసీపీ ఎమ్మెల్యేలు అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. బొబ్బిలి ఎమ్మెల్యే నిన్నటి రోజున అంగన్వాడీలు ఒళ్ళు కొవ్వెక్కి నిరసన తెలిపారన్న మాటలు వెనక్కి తీసుకోవాలన్నారు. అంగన్వాడీలకు క్షమాపణ చెప్పాలన్నారు. సిపిఎం తిరుపతి నగర కార్యదర్శి సుబ్రహ్మణ్యం, కాంగ్రెస్ పార్టీ మాజీ కేంద్రమంత్రి చింతా మోహన్ మద్దతు ప్రకటించారు. నాయకులు పి.బుజ్జి, ఎం.జయంతి, రమేష్ పాల్గొన్నారు.

✦ గూడూరులో టిడిపి రాష్ట్ర మహిళా కార్యదర్శి గుండాల లీలావతి, పార్లమెంటరీ ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణిరెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శి బత్తిల ప్రమీల తదితరులు సంఘీభావం ప్రకటించారని అంగన్‌వాడీ అధ్యక్షురాలు ఎ.ఇంద్రావతి పేర్కొన్నారు.

✦ జీడీనెల్లూరు టిడిపి ఎంఎల్ఏ అభ్యర్థి డాక్టర్ థామస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలకు సంఘీభావంగా శుక్రవారం భోజన ఏర్పాటు చేశారు. కార్వేటినగరం, శ్రీరంగరాజపురం, వెదురుకుప్పం మండలాల నుంచి దాదాపు 350 మంది అంగన్‌వాడీలు పాల్గొన్నారని తెలిపారు.

✦ బివిఎన్ కండ్రిగలో సిపిఐ జిల్లాకార్యవర్గ సభ్యులు కత్తిరవి, టిడిపి మండల కార్యదర్శి సుధాకర్‌నాయుడు సంపూర్ణ మద్దతు ప్రకటించారు.

✦ పిచ్చాటూరులో నల్లచీరలు కట్టుకుని అంగన్‌వాడీలు భారీ ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీ సెంటర్ల తాళాలు పగలగొడితే తీవ్ర పరిణామాలు ఉంటాయని నాయకులు ఇంద్రాణి, రాజేశ్వరి హెచ్చరించారు. గుర్రాలతో తొక్కించినపుడే బెదరలేదన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దాసరి జనార్ధన్, టిడిపి నేత డి.ఇలంగోవన్‌రెడ్డి మద్దతు ప్రకటించారు.

✦ వరదయ్యపాలెంలో సిఐటియు నాయకులు రమేష్ మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది, వలంటీర్ల సాయంతో

అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహించాలని కలెక్టర్ తీసుకున్న నిర్ణయం అధికార అహంకారాన్ని చూపిస్తోందన్నారు.

✦ శ్రీకాళహస్తిలో మాజీ మంత్రి బొజ్జల గోపాలక్రిష్ణారెడ్డి సతీమణి బొజ్జల బృందమ్మ, ఆమె కోడలు రిషితారెడ్డి, జనసేన ఇన్‌ఛార్జి వినుత కోటా సంఘీభావం ప్రకటించారు. అక్కచెల్లెమ్మలను జగన్మోహన్‌రెడ్డి రోడ్డున పడేశారన్నారు.

✦ నగరిలో జనసేన సమన్వయకర్త మెరుపుల మహేష్, కాంగ్రెస్ నాయకులు కోదండయ్య, కేశవులు, సిపిఎం, సిపిఐ నాయకులు వెంకటేష్, మహేష్ సంఘీభావం తెలిపారని యూనియన్ నాయకులు ధనకోటి మునెమ్మ తెలిపారు.

✦ రేణిగుంటలో నల్లచీరలతో నిరసన తెలుపుతూ అంబేద్కర్ విగ్రహానికి, ఎంపిడిఒ, తహశీల్దార్‌కు వినతిపత్రాలు ఇచ్చారు. అంగన్‌వాడీ సెంటర్ల తాళాలు పగలగొట్టి తెరవడాన్ని దుర్మార్గమైన చర్యని మండిపడ్డారు. టిడిపి మండల అధ్యక్షులు మునిచంద్రరెడ్డి, సిఐటియు నాయకులు కె.హరినాథ్ సంఘీభావం తెలిపారు. టిడిపి నాయకులు 200 మందికి భోజనాలు పెట్టి మద్దతు ప్రకటించారు.

✦ పలమనేరులో టిడిపి అధ్యక్షులు సోమశేఖర్‌గౌడ్ సంఘీభావం ప్రకటించారు. గిరిధర్, విఆర్‌జ్యోతి, శాంతి, ఆర్.వెంకటరత్నమ్మలు ప్రసంగించారు.

✦ వి.కోటలో ఐద్వా జిల్లా కార్యదర్శి భువనేశ్వరి సంఘీభావం క్రటించారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి, జాతీయ రహదారిపై నిరసన తెలిపారు. స్థానికుల నుంచి మద్దతు లభించింది. ఎంఆర్ఒ కార్యాలయం వద్ద పాటలతో నిరసన కొనసాగించారు.

✦ బంగారుపాళ్యంలో జానపద కళాకారుల రాష్ట్ర కార్యదర్శి బంగారు మురళి, సిఐటియు నాయకులు సురేంద్ర మద్దతు తెలిపారు.

– కుప్పంలో తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎంఎల్‌సి కంచర్ల శ్రీకాంత్ మద్దతు తెలిపారు. శాంతిపురంలో మాజీ ఎంఎల్‌సి గౌనివారి శ్రీనివాసులు పాల్గొన్నారు.

– సూళ్లూరుపేటలో లారీ వర్కర్స్ యూనియన్ నాయకులు సత్యం, రమేష్, జాలయ్య, సిఐటియు నాయకులు పద్మనాభయ్య, టిడిపి నాయకులు బుద్ధి విజయలక్ష్మి, జనసేన నాయకులు ప్రవీణ్ సంఘీభావం ప్రకటించారు.

✦ చంద్రగిరిలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఆంజనేయస్వామి విగ్రహం నుంచి ఎంఆర్ఒ ఆఫీసు వరకు ర్యాలీ నిర్వహించారు. యూనియన్ జిల్లా కార్యదర్శి ఎస్.వాణిశ్రీ, సిఐటియు నాయకులు జయచంద్ర మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సమ్మెను భగ్నం చేయాలని అధికారులపై ఒత్తిడి తెస్తుందన్నారు.

✦ నాయుడుపేటలో మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ జిల్లా కార్యదర్శి కె.విజయమ్మ, యుటిఎఫ్ సీనియర్ నాయకులు రాజశేఖర్‌రెడ్డి సంఘీభావం తెలిపారని ప్రాజెక్టు కార్యదర్శి శ్యామలమ్మ, నాయకులు శివకవి ముకుంద తెలిపారు.

నల్లగుడ్డలతో నిరసన

చిత్తూరు అర్బన్ : అంగన్‌వాడీ సెంటర్ల తాళాలు పగలగొట్టడాన్ని నిరసిస్తూ నల్లగుడ్డలతో నిరసన తెలిపారు. అంగన్‌వాడీలు న్యాయమైన సమస్యల పరిష్కారానికి నాలుగురోజులుగా సమ్మె చేస్తుంటే అర్ధరాత్రిలో సెంటర్ల తాళాలు పగలగొట్టడాన్ని నిరసిస్తూ చిత్తూరు ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. సిఐటియు జిల్లా గౌరవాధ్యక్షులు వాడ గంగరాజు, ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి ప్రేమ, ఎఐటియుసి గౌరవాధ్యక్షులు ఎస్.నాగరాజు, సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.చైతన్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పదేపదే చర్చల పేరుతో సమస్యలు పరిష్కారం చేయకుండా నానబెడుతోందన్నారు. దీనికి మూల్యంచెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి, సిఐటియు నాయకులు సుజని ,బుజ్జి ఏఐటీయూసీ నాయకులు ప్రభావతి లతోపాటు జ్యోతి, చంద్ర రమాదేవి జరిగింది.

బీగాలు బద్దలుకొట్టి..! ఇద్దరు ముగ్గురు పిల్లలతో మమ అనిపించారు

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ, బైరెడ్డిపల్లి, వి.కోట

రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీలు తమ సమస్యల పరిష్కారం కోసం నాలుగురోజులుగా సమ్మె చేస్తుంటే, పరిష్కరించాల్సిన ప్రభుత్వం సమ్మెపై ఉక్కుపాదం మోపింది. సమ్మెను విచ్ఛిన్నం చేసేందుకు సచివాలయ ఉద్యోగులకు అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ బాధ్యతను అప్పగించింది. అయితే ఇద్దరు ముగ్గురు పిల్లలను పిలుచుకుని వచ్చి భోజనం పెట్టించి మమ అనిపించారు. బుచ్చినాయుడు కండ్రిగ మండలంలోని భవాని శంకరాపురం అంగన్‌వాడీ కేంద్రాన్ని సచివాలయ ఉద్యోగులు, డ్వాక్రా సంఘాల ద్వారా తాళాలు పగలగొట్టి శుక్రవారం తెరిపించారు. భోజన సమయానికి ప్రభుత్వ పాఠశాలలో తయారు చేసిన మధ్యాహ్న భోజనాన్ని పిల్లలకు పెట్టేలా ఆదేశించినట్లు ఎంపిడిఒ సాయిలహరి తెలిపారు. పంచాయతీ కార్యదర్శి ఇందిర పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లిలో ఎంపిడిఒ రాజేంద్ర బాలాజీ సచివాల ఉద్యోగులతో తాళాలు పగలగొట్టారు. పిల్లకు పోషకాహారం అందించాలని ప్రయత్నించినా ఫలితం విఫలమయ్యింది. తాళాలు తెరిచారు గానీ భోజనాన్ని అందిస్తామని చెప్పినా పిల్లలు ఎవరూ రాలేదు.

వి.కోట మండలం గాండ్లపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో సచివాలయ సిబ్బంది తాళాలు పగలగొట్టారు.

కోట మండలం కొక్కుపాడు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సచివాలయ సిబ్బంది పగలగొట్టారు. వెంకటగిరిలో జేసీ సూచన మేరకు తాళాలు పగలగొడుతున్నామని సిడిపిఒ శంషాద్‌బేగం తెలిపారు. సచివాలయ సిబ్బంది ద్వారా 111 అంగన్‌వాడీ సెంటర్లను ప్రారంబించామన్నారు.



బీగాలు తీస్తున్న సచివాలయ సిబ్బంది

అంగన్‌వాడీ కేంద్రాల్లో దొంగలు పడ్డారు
జిబిఎస్ మణ్యం, సిఐటియు జిల్లా అధ్యక్షులు

అంగన్‌వాడీ కేంద్రాల్లో దొంగలు పడ్డారు. తాళాలు పగలగొట్టి దోచుకెళ్లే అవకాశం ఉంది. 2019లో సిఎం ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని అంగన్‌వాడీలు సమ్మెచేస్తుంటే, పిలిపించి చర్చలు జరిపి హామీలు నెరవేర్చాల్సింది పోయి సమ్మెను విచ్ఛిన్నం చేయడానికి ప్రయత్నిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల తాళాలు పగలగొట్టడం ఎంతవరకు సమంజసం. ఇచ్చిన మాట నిలబెట్టుకోని ముఖ్యమంత్రులు కాలగర్భంలో కలిసిపోయారు. సుప్రీం ఇచ్చిన గైడ్‌లైన్స్ ప్రకారం గ్రాడ్యుటీ ఇవ్వాలి. వెంకటగిరిలో సమ్మెలో వడ్డిపల్లి చెంగయ్య, స్వరూపరాణి, మంజుల, ప్రసన్న, అనురాధ నాయకత్వం వహించారు.

పాడి రైతుల కడుపు కొడుతున్నారు

- రైతుభేరికి వెళ్లనీకుండా అడ్డంకులు
- రామచంద్రయాదవ్ ఇల్లు దిగ్బంధం

ప్రజాశక్తి - పుంగనూరు

'పుంగనూరులో నియంత పాలన సాగుతోందని, పెద్దిరెడ్డి రాజ్యాంగం నడుస్తోందని, పాల రైతుల కడుపు కొడుతున్నారు' అని భారత చైతన్య యువజన పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు రామచంద్ర యాదవ్ మండిపడ్డారు. సదుం మండల కేంద్రంలో చేపట్టిన రైతుభేరి కార్యక్రమం జరగకుండా శుక్రవారం రామచంద్రయాదవ్ ఇంటిని పోలీసులు దిగ్బంధించారు. ఎటోసి కాలనీకి వెళ్లే రహదారులన్నీ పోలీసులు మూసివేశారు. ఆ వీధిలోకి ఎవరు వెళ్లలన్నా ఆధార్లు ప్రూఫ్ చూపించాలని నిర్బంధం విధించారు. రామచంద్రయాదవ్ సతీమణి శుక్రవారం గుడికి వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా వాహనాన్ని లోనికి వెళ్లకుండా అడ్డుకున్నారు. కొంతసేపు వాగ్వాదం తరువాత వాహనాన్ని లోనికి అనుమతించడం గమనార్హం. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుభేరి కార్యక్రమానికి సిద్ధమై బయలుదేరుతుండగా ఒకటిన్నర గంట ముందు సభకు అనుమతి లేదంటూ నోటీసులు ఇవ్వడం ఎంతవరకు సమంజసమన్నారు. పుంగనూరు నియోజకవర్గంలో పనిచేస్తున్న ప్రభుత్వ వ్యవస్థలన్నీ మంత్రి కోసమే ఉన్నాయని, పేద ప్రజల కోసం పనిచేయడం లేదని ఆరోపించారు. ఒక వ్యక్తి లబ్ధి కోసమే పోలీసు వ్యవస్థ పనిచేస్తుందని స్పష్టంగా అర్థం అవుతుంది అన్నారు. తాము రైతు భేరి పెడితే ఎక్కడ ఆయన తప్పులు ఎత్తి చూపుతావేమోనని భయపడి వ్యవస్థను అడ్డు పెట్టుకోవడం సిగ్గుచేటు అన్నారు. ఎస్పీ రిశాంత్ రెడ్డి పెద్దిరెడ్డికి పూర్తి సహకారం అందిస్తూ వ్యవస్థకు చెడ్డ పేరు తెస్తున్నారని ఆరోపించారు. నియోజకవర్గంలో సభలు జరగనివ్వకుండా అడ్డుకోవడం చూస్తే ఆయన నైతికంగా ఓటమి చెందినట్లు ఒప్పుకుంటున్నారని చెప్పారు. నియోజకవర్గంలో మంత్రి పాల డెయిరీ రైతుల పొట్ట కొట్టి వారి రక్తం తాగుతున్నారని చెప్పారు. ఒక రోజుకి 40 వేల లీటర్ల పాలు డెయిరీకి తీసుకెళ్తూ లీటరుకు పది రూపాయలు పైన రైతులు వద్ద నుండి దోచుకుంటున్నారని చెప్పారు. నియోజకవర్గంలో రైతాంగ సమస్యలపై పోరాటం చేస్తుండని వైసీపీని ఇంటికి పంపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రశాంతంగా పుంగనూరు నియోజకవర్గంలో ఎన్నికలు జరిగే విధంగా కేంద్ర ఎన్నికల కమిషన్ దష్టికి తీసుకెళ్తామన్నారు. నియోజకవర్గంలో ఎలాంటి సభ లు ,సమావేశాలు పెట్టాలన్న వ్యవస్థలను అడ్డం పెట్టుకొని అడ్డుకోవడంపై గవర్నర్కు, మానవ హక్కులకు ,కోర్టుకు వెళ్లనున్నట్లు చెప్పారు.

ఏసీబీ వలకు చిక్కిన అవినీతి చేప

- రామకుప్పంలో రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డ వీఆర్‌వో ఆనంద్
- రూ.25వేలు తీసుకుంటుండగా అదుపులోకి తీసుకున్న అధికారులు
- లంచం అడిగితే ఫోన్ చేయాలని ఏసీబీ విజ్ఞప్తి

ప్రజాశక్తి-రామకుప్పం: రైతు పాసు పుస్తకంలో తప్పులు సరిచెసెందుకు లంచం తీసకుంటుండగా రామకుప్పం మండల పరిధిలోని బందర్లపల్లి విఆర్ఓ ఆనంద్‌ను శుక్రవారం తిరుపతి ఏసిబి అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఏసీబీ అడిషనల్ డి.ఎస్.పి దేవప్రసాద్ తెలిపిన వివరాల మేరకు.. నక్కబాలేపల్లికి చెందిన మునిరత్నం, రవికుమార్, జశ్వంత్ అన్నదమ్ములు. వీరి తల్లి ఏడేళ్ల క్రితం మరణించడంతో అమే పేరునవున్న 3.14ఎకరాల డీకేటి భూమిని అన్న దమ్ములు పంచుకున్నారు. అయితే ముగ్గరి పాసుపుస్తకాలలో తప్పులు రావటంతో మునిరత్నం విఆర్ఓ ఆనంద్‌ను కలిసి తన సమస్యను తెలిపాడు. అయితే పాసుపుస్తకాలు కరెక్షన్ చేసేందుకు రూ.35 వేలు ఇవ్వాలని విఆర్ఓ డిమాండ్ చేశాడు. చివరకు రూ.25వేలు ఇస్తానన్న మునిరత్నం లంచం ఇవ్వటం ఇష్టం లేక ఏసిబి అధికారులను ఆశ్రయించాడు. రాజుపేట వద్ద రైతు మునిరత్నం నుండి విఆర్ఓ ఆనంద్ లంచం రూ.25వేలు తీసుకుంటుండగా ఏసిబి అధికారులు వీఆర్‌వోను పట్టుకున్నారు. అనంతరం రామకుప్పం మండల రెవెన్యూ కార్యాలయంకు చేరుకొని పలు రికార్డులను పరిశీలించారు. సిబ్బందిని ఆరా తీశారు. ప్రభుత్వ శాఖలలో పనిచేసే ఉదోగులు ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే 144 00 టోల్ ఫ్రీ నెంబర్‌ను సంప్రదించలని ఏసిబి అడిషనల్ డిఎస్పి దేవప్రసాద్ చిత్తూరు, తిరుపతి జిల్లాల ప్రజలను కోరారు. ఆయన వెంట ఏసీబీ సిబ్బంది ఈశ్వర్, నవీన్, వెంకటనారాయణ, సూర్య నారాయణ తదితరులు ఉన్నారు.

విఆర్ఓ ఆనంద్

ప్రకృతి వ్యవసాయ పంటలతో ఆరోగ్యం

జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

ప్రజాశక్తి-చిత్తూరు: ప్రకృతి వ్యవసాయం ద్వారా ప్రజలు ఆరోగ్యవంతంగా జీవించేందుకు, జీవరాశులు మనుగడ సాధించేందుకు వీలుంటుందని జడ్పి చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం పాలసముద్రం మండల కేంద్రంలో వ్యవసాయ సలహా మండలి సమావేశం రైతు చంద్రశేఖర్ రాజుకు చెందిన 35 ఎకరాల ప్రకృతి వ్యవసాయ క్షేత్రంను ఎంపి రెడ్డెప్ప, జేసి పి.శ్రీనివాసులు, ఇతర సలహా మండలి సభ్యులు, అధికారులతో కలిసి జెడ్ పి ఛైర్మన్ పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా పశువుల పేడతో చేసిన ధూపంను, ఘిర్ జాతికి చెందిన పశువులను, పకృతి వ్యవసాయంతో పెంచుతున్న వివిధ రకాల మొక్కలను పరిశీలించారు. జెడ్పి ఛైర్మన్ మాట్లాడుతూ జీవ వైవిధ్య కారకాలు ప్రకృతి వ్యవసాయంలో వుంటాయని, ప్రకృతికి కాపాడుకోవలసిన అవసరం ఉందన్నారు. ప్రకృతి పరంగా జీవ వైవిధ్యాన్ని కాపాడుతున్న విధానంను వారు పరిశీలించారు. చిత్తూరు ఎంపీ ఎన్. రెడ్డప్ప మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అండగా ఉంటూ లాభసాటి వ్యవసాయంనకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నదన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అవసరమైన అన్ని సలహాలు, సూచనలు అందిస్తూ ఆధునిక వ్యవసాయ సాగు పద్ధతులను రైతులకు తెలియజేయడం జరుగుతున్నదన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ పి. శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ఉత్పత్తులతో ఆరోగ్యంగా జీవించవచ్చునని తెలిపారు. ప్రకృతి వ్యవసాయ విధానం పట్ల రైతులకు అవగాహన కల్పించడం జరుగుతోందని, ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు స్థానికంగా మంచి డిమాండ్ ఉన్నదని, తద్వారా ఉత్పత్తులకు మంచి మార్కెట్ ఉన్నదని తెలిపారు. ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను పరిశీలించి మార్కెటింగ్ సౌకర్యం గురించి రైతును అడిగి తెలుసుకున్నారు. ఇతర ప్రాంతాలకు చెందిన జీవ వైవిధ్య ప్రేమికులు ఈ ప్రాంతానికి వస్తుంటారని రైతు తెలిపారు. ఈ సమావేశంలో డ్వామా పిడి గంగా భవానీ, జిల్లా వ్యవసాయ,ఉద్యానవన పశు సంవర్ధక, పట్టు పరిశ్రమ శాఖలకు సంబంధించిన అధికారులు మురళీకృష్ణ మధుసూదన్ రెడ్డి డాక్టర్ ప్రభాకర్,శోభారాణి, సంబంధిత జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

పరిసరాల్లో నీటి నిల్వ లేకుండా చూసుకోవాలి

- డిఎంహెచ్‌వో ప్రభావతి

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకొంటూ దోమలు ప్రబలకుండా చూసుకోవాలని డిఎంహెచ్‌వో ప్రభావతి సూచించారు. శుక్రవారం చిత్తూరు నగర పరిధిలోని వినాయకపురంలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నీటి నిల్వలే దోమలకు నిలయాలన్నారు. ప్రస్తుతం వర్షం పడుతున్నందున ఎవరికివారు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి శ్రీనివాసులు, సబ్ యూనిట్ అధికార్లు పీరు సాహెబ్, రామకృష్ణ, లలిత్, నారాయణ, శానిటేషన్ సెక్రటరీలు,ఆరోగ్య కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డిఎంహెచ్‌వో

ఎప్పటికప్పుడు యాప్‌లు అప్డేట్ చేయండి

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: సీనియర్ అసిస్టెంట్‌లు వివిద రకాల వైద్య ఆరోగ్యశాఖ యాప్‌లను అప్‌డేట్ చేయాలని డీఎంహెచ్‌వో ప్రభావతి సూచించారు. శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సమావేశ మందిరం నందు సీనియర్ అసిస్టెంట్లతో సమీక్ష నిర్వహించారు. పీహెచ్‌సీలో డెలివరీ జరిగితే ఆ కేస్‌కు సంబంధించిన వివరాలను ఆరోగ్య ఆసరా యాప్ నందు పొందుపరచాలన్నారు. తద్వారా లబ్ధిదారులకు రూ.5వేల సాయం అందుతుందన్నారు. గర్భిణీ స్త్రీలకు లబ్ధి పొందే పథకాలు వీటిని తప్పనిసరిగా ఎప్పటికప్పుడు యాప్ నందు అప్లోడ్ చేయాలన్నారు. తద్వారా గర్భిణీ స్త్రీ మంచి పౌష్టికాహారం తీసుకొని పండంటి బిడ్డకు జన్మనిచ్చే అవకాశం ఉందన్నారు. వీటికన్నిటికీ సంబంధించిన నివేదికలు జిల్లా ఆఫీస్‌కు ఎప్పటికప్పుడు పంపాలన్నారు. కార్యక్రమంలో ఏఒ విజయ్‌బాబు, ఆఫీస్ సూపర్‌ఇంటెండెంట్లు, జిల్లాలోని సీనియర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ ఆరోగ్య శ్రీ యాప్‌పై అవగాహన

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ప్రభావతిదేవి చిత్తూరు అర్బన్ పరిధిలోకి 7 హెల్త్ సెంటర్లలో ఉన్న ఏఎన్ఎంలకు "డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ యాప్ పై" ట్రైనింగ్ ఇవ్వడం అయినది. రాబోయే 18వ తేదీన డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్య శ్రీ పథకంపై ముఖ్యమంత్రి లాంచనంగా ప్రారంభిస్తారు. 20 నుండి మన ప్రాంతంలో స్థానిక ప్రజా ప్రతినిధులతో ప్రారంభించి ఇంటింటి సర్వేలో ఆరోగ్యం బ్రోచర్ ఇస్తూ యాప్ ను డౌన్లోడ్ చేయించి వాటి యొక్క ఉపయోగాలను ప్రతి ఒక్కరికి విపులంగా వివరించడం జరుగుతుంది. కావున ప్రజలందరూ అవగాహనతోటి ప్రతి ఒక్కరూ అనారోగ్య బాధితులు రూ.వెయ్యి పైబడిన ప్రతి చికిత్స ఉచితంగా పొందాలన్నారు. డాక్టర్ సుదర్శన్, వాణిశ్రీ, డెమో జయరాముడు పాల్గొన్నారు.

వేతనాలు పెంచాలని 'ఆశా'..
ప్రభుత్వానికి పట్టదా ఘోష

- రెండవ రోజూ కలెక్టరేట్ ఎదుట వంటావార్పుతో నిరసన
- సర్కార్ దిగిరావాలంటూ 'ఆశా'ల నినాదాలతో దద్దరిల్లిన కలెక్టరేట్

కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఆశా వర్కర్లు

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: ఆశాల ఘోష ప్రభుత్వానికి వినిపించడం లేదా... ఇచ్చిన హామీలను నెరవేర్చాలంటూ ధర్నాలు, రాస్తారోకోలు ఆందోళనలు చేసినా ప్రభుత్వం వినిపించుకోవడం లేదంటూ ఆశా వర్కర్స్ యూనియన్ నేతలు గంగా, కృష్ణవేణి, పద్మలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆశాల సమస్యలపై కలెక్టరేట్ ఎదుట గురు, శుక్రవారాల్లో 36 గంటల పాటు నిరసన దీక్షలు నిర్వహించారు. రెండో రోజైన శుక్రవారం కలెక్టరేట్ ఎదుటే వంటవార్పుతో నిరసన తెలిపారు. ప్రస్తుతం పెరిగిన నిత్యవసర వస్తువుల ధరలతో ఆశాలకు ప్రభుత్వం ఇచ్చే పారితోషకం ఏపాటిదో ప్రభుత్వ పెద్దలు అర్థం చేసుకోవాలని రాష్ట్ర ముఖ్యమంత్రి జీతాలు పెంచేస్తున్నం అని ప్రకటిస్తేసరిపోతుందా జీవోలు ఇచ్చిన అమలుకు నోచుకోవడంలేదన్నారు. కరోనా కాలంలో ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని సేవలు చేస్తే ఆశాలకు ఇచ్చే గౌరవం ఇదే అంటూ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇచ్చే జీతంలో సగం టిఏ, డిఏలకే సరిపోతోందని పైగా సంక్షేమ పథకాల్లో కోతలు విధిస్తూ అనర్హులుగా ప్రటించడం ఏమిటని మండిపడ్డారు. వైద్య రంగంలో మార్పులంటే కష్టపడి పని చేసే ఆశాలకు కనీస వేతనాలు అమలు చేయడంతో పాటు, ప్రసూతి సెలవులు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఆశాల ఆందోళనకు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సురేంద్రన్ సంపూర్ణ మద్దతు ప్రటించారు. ఆశాల సమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించి పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆశాల పోరాటానికి సిఐటియు జిల్లా అధ్యక్షులు చైతన్య, ఉపాధ్యాక్షులు వాడ గంగరాజు, టిడిపి నాయకులు సప్తగిరి ప్రసాద్, మోహన్‌రాజులు మద్దతు తెలిపారు.

ఉద్యోగుల స్పందనకు 7 అర్జీలు: డిఆర్‌ఓ

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రతి మూడవ శుక్రవారం స్పందన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, ఇందులో భాగంగా శుక్రవారం వివిధ శాఖలకు సంబంధించి 07 అర్జీలు అందాయని డీఆర్‌వో రాజశేఖర్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన ఉద్యోగుల స్పందన కార్యక్రమంలో డీఆర్‌వో అర్జీలు స్వీకరించారు. రెవెన్యూశాఖ 3, డియంఅండ్‌హెచ్‌ఓ 1, విద్యాశాఖ1, భూగర్భ జలవనరులశాఖ1, చిత్తూరు నగరపాలక సంస్థ1, చొప్పున అర్జీలు అందినట్లు డీఆర్‌వో తెలిపారు.

సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహకానికి దరఖాస్తులు

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహకానికి అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు సాంఘీక సంక్షేమ శాఖ డీడీ రాజ్యలక్ష్మీ ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో మెయిన్స్ పరీక్షల్లో అర్హత సాధించిన అభ్యర్థులు పోర్టల్‌లో అంధించిన వెబ్‌లింక్ ద్వారా ఆన్‌లైన్ ధరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈనెల 19న ఆఖరు గడువుగా పేర్కొన్నారు.

నేడు ఎపిటిఎఫ్ జిల్లా కార్యవర్గ సమావేశం

ప్రజాశక్తి చిత్తూరుఅర్బన్: ఏపీ టీచర్స్ ఫెడరేషన్ 75 సంవత్సరాలకు పైగా విద్యా రంగానికి విశేషమైన సేవలు అందించిన సందర్భంగా కార్యవర్గ సమావేశం నిర్వహిస్తున్నట్లు శుక్రవారం అధ్యక్ష, కార్యదర్శులు గోపినాథ్, ముక్తా రహమద్ ప్రకటన విడుదల చేశారు. స్థానిక జైహింద్ నగరపాలక పాఠశాల (మార్కెట్ దగ్గర) ఉదయం10 గంటలకు కార్యక్రమం జరుగుతుందన్నారు. కార్యక్రమానికి జిల్లా, మండల కమిటీలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

వ్యాధి నిర్ధారణకు రక్త పరీక్షలు అవసరం

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: జలుబు దగ్గు మూడు రోజులకు పైగా ఉంటే సమీపం లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రక్త పరీక్షలు చేసుకోవాలని ఠాణ్యంబ్రం పీహెచ్‌సీ వైద్యులు కొండారి ప్రశాంత్ కోరారు. ఠాణ్యంబ్రం పీహెచ్‌సీలో శు క్రవారం ఆయన మాట్లాడుతూ వాతావరణం పెరుగుతున్నందువలన పిల్లలు, పెద్దల్లో ఆరోగ్యపరంగా ఇబ్బందులు ఉన్నాయన్నారు. ఇంటి చుట్టుపక్కల మురుగునీరు నిల్వ లేకుండా చేసుకోవాలని సూచించారు. దోమల నుంచి రక్షణ పొందాలన్నారు ఉదయం మంచి తీవ్రత ఎక్కువగా ఉన్నందున కళ్ళ, ముక్కు, మినహా మిగతా శరీరమంతా కప్పేలా దుస్తులు ధరించాలని వివరించారు.

డాక్టర్ ప్రశాంత్

వేణుగోపాలస్వామి ఆలయంలో అన్నదానం

ప్రజాశక్తి-కార్వేటినగరం: కార్వేటినగరం శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో టీటీడీ ఆలయ సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో టీటీడీ సిబ్బంది టి.సుజాత కుటుంబ సభ్యులు శు క్రవారం ఆలయంలో వంద మందికి అన్నదానం చేశారు. వారిని టీటీడీ అధికారి అభినందించారు.

బాలోత్సవ కమిటీ అధ్యక్షులుగా తులసినాథం

తులసినాథం

యుగంధర్

ప్రజాశక్తి - గంగవరం: బాలోత్సవ కమిటీ అధ్యక్షులుగా తులసినాథం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండలం లోని కళామందిర్‌లో శుక్రవారం జరిగిన సమావేశంలో నూతన బాలోత్సవ కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా యుగంధర్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాల స్థాయి పిల్లలలో సామాజిక స్పృహ దేశభక్తి, వ్యక్తిత్వ వికాసం, శాస్త్రీయ దృక్పథం, జ్ఞానశక్తి పెంపొందించడానికి ఈ కమిటీని ఏర్పాటు చేసినట్లు ఆయన తెలియజేశారు.

సేవలు గుర్తుచేసుకొని.. సన్మానంతో వీడ్కోలు

ప్రజాశక్తి-కార్వేటినగరం: కత్తెరపల్లె పీహెచ్‌సీలో డాక్టర్ గోపి నాథ్, డాక్టర్ యాసిన్ సేవలు గుర్తించదగ్గవని సర్పంచ్‌లు గుణశేఖర్, లోకనాథనాయుడు అన్నారు. ఇరువురు వైద్యులు కత్తెరపల్లె నుంచి సీహెచ్‌సీకి బదిలీ అయ్యారు. దీంతో శుక్రవారం వైద్య సిబ్బంది, ప్రజాప్రతినిధులు దుశ్శాలువతో ఘనంగా సన్మా నించి వీడ్కోలు పలికారు. కాగా ఇరువురు డాక్టర్లు కత్తెరపల్లె పీహెచ్‌సీలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించినందుకు పలువురు కొనియాడారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కుప్పయ్య, కుప్పారెడ్డి, స్టాఫ్ నర్స్ సునీత, సిహెచ్ఓ రాజేశ్వరి, పీహెచ్ఎన్ గౌరీ, సూపర్వైజర్ త్యాగరాజు, హిమాయతుల్లా, అంబ్రిష్ రాజు, సుమన్, మణి, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్న్‌షిప్‌పై అవగాహన అవసరం

ప్రజాశక్తి-వెదురుకుప్పం: విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌పై అవగాహన అవసరమని డాక్టర్ వైఎస్ఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అన్నపూర్ణ శారద అన్నారు. శుక్రవారం కళాశాలలో తిరుపతికి చెందిన సత్యా ఇన్ఫోటెక్ సంస్థ సహకా రంతో జేకేసీ, ఓజేటి, ఐక్యూఏసీ, ఆధ్వర్యంలో ఇంటర్న్‌షిప్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సత్య ఇన్ఫోటెక్ సాఫ్ట్‌వేర్ డెవలపర్స్ యశ్వంత్, హేమంత్ మాట్లాడుతూ విద్యార్థులకు వివిధ రంగాలలో ఇంటర్న్‌షిప్‌ల ప్రాముఖ్యత, వాటి ద్వారా నైపుణ్యాలు, ఉద్యోగ అవకాశాలను పెంపు కోవడం గురించి వివరించారు. విద్యార్థులు తమ ఆసక్తులకు అనుగుణంగా ఇంటర్న్‌షిప్‌లను ఎలా ఎంచుకోవాలో, వాటి కోసం ఎలా దరఖాస్తు చేయాలో అనే విషయాలను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి. అన్నపూర్ణ శారద, వైస్ ప్రిన్సిపాల్ వి.ప్రభాకర్‌రావు, ఓ.జే.టి. ప్లేస్మెంట్ కోఆర్డినేటర్ డాక్టర్ కె.శంకర్‌రెడ్డి, ఐక్యూఏసి కో-ఆర్డినేటర్ వెంకటేష్, జే.కే.సి కో-ఆర్డినేటర్ వి.నాగేశ్వరరావు అవగాహన కల్పించారు.

వాటర్ ట్యాంక్ నిర్మాణానికి భూమి పూజ

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండలంలోని ఎం.కొత్తూరు సంచాయతీ పరిధిలోని నెల్లిపట్ల గ్రామంలో తాగునీటి సమస్య శాశ్వతంగా పరిష్కరించేందుకు జల జీవన మిషన్ ఫండ్స్ ద్వారా రూ.11.86లతో కొత్త వాటర్ ట్యాంక్ నిర్మాణానికి సర్పంచ్ రాజారెడ్డి శుక్రవారం భూమి పూజ చేశారు. గ్రామస్తుల సమక్షంలో వార్డు మెంబర్లు కలిసి నిర్వహించారు కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ చంద్రమోహ్ అలియాస్ రాజారెడ్డి వార్డు మెంబర్లు గ్రామస్తులు పాల్గొన్నారు.

భవిష్యత్ తరాల కోసమే ఇంధన పొదుపు

ప్రజాశక్తి-గంగవరం: భవిష్యత్ తరాల కోసం ఇంధనాన్ని పొదుపుని చేద్దామని మదర్ థెరిసా విద్యా సంస్థల చైర్మన్ రవీంద్రబాబు పిలుపునిచ్చారు. శుక్రవారం మదర్ థెరిస్సా కళాశాలలో ఇంధన పొదుపు జాతీయ సదస్సు ఈఈఈ విభాగంచే నిర్వహించారు. తమిళనాడులోని హోసూర్‌లో యూనివర్స్ సొల్యూషన్ డైరెక్టర్ సురేంద్ర ఇంధన పొదుపుపై ఇంజనీరింగ్ పాత్ర కీలకమని డైరెక్టర్ అన్నట్లు విద్యాసంస్థల చైర్మన్ రవీంద్రబాబు తెలిపారు. ఈ కంపెనీ డైరెక్టర్‌తో ఎం.ఓ.యును కుదుర్చుకున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో విద్యా సంస్థల చైర్మన్ ఎం.ఆర్ సునీల్, డైరెక్టర్ డాక్టర్ రాజేంద్రరెడ్డి, ప్రిన్సిపాల్ లక్ష్మీకాంత్‌రెడ్డి, ఈఈఈ విభాగపు ప్రిన్సిపాల్ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

‘చెప్పిన హామీలను నెరవేర్చిన ఘనత సీఎం జగన్‌దే’

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: చెప్పిన హామీలను నెరవేర్చిన ఘనత జగన్మోహన్ రెడ్డి దే అని ఎంపీపీ అమరావతి అన్నారు. శు క్రవారం మండలంలోని తగ్గువారిపల్లి సచివాలయంలోని ఏపీకి జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని సర్పంచ్ వాణిప్రియ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డి, జెడ్పీటీసి సోమశేఖర్, కోఆప్షన్ మెంబర్ ఫిరోజ్ అహ్మద్, ఎంపీటీసీ ఉపాధ్యక్షులు సర్దార్, ఎంపీటీసీ హేమచంద్ర, నాయకులు కుట్టి, గిరి, వెంకటేష్, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

చైతన్య పరుస్తూ.. ఓటు ప్రాముఖ్యతను వివరిస్తూ..

ర్యాలీ నిర్వహిస్తున్న సీఈవో, ఇతర అధికారులు

ప్రజాశక్తి-పుంగనూరు: ఓటు హక్కుపై ప్రతి పౌరుడు అవగాహన కలిగి ఉండాలని జెడ్పీ సీఈవో ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక గోకుల్ సర్కిల్‌లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ఓటరు నమోదుకు 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న యువతి, యువకులు ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలన్నారు. ఆఫ్లైన్ ద్వారా ఓటర్ నమోదుకు సమయం ముగిసిందని ఆన్లైన్ ద్వారా చేసుకోవచ్చుని తెలిపారు. ఫామ్-6 ద్వారా కొత్తగా ఓటరు నమోదు చేసుకోవడానికి అవకాశం ఉందన్నారు. ఫామ్-6ఎ ద్వారా భారతీయ పాస్‌పోర్ట్ కలిగిన విదేశాల్లోని భారతీయులు ఓటరుగా నమోదు కావచ్చు అన్నారు. ఫామ్-6బి ఓటర్ కార్డును ఆధార్ కార్డుకు లింకు చేయవచ్చునని చెప్పారు. కావున అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ వీటిని ఉపయోగించి ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నరసింహ ప్రసాద్, తహశీల్దార్ సీతారాం, ఎంపీడీవో నారాయణ, మున్సిపల్ వైస్ చైర్మన్ నాగేంద్ర, సచివాలయ, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

నూతన భూహక్కు చట్టాలను రద్దు చేయండి : న్యాయవాదులు

ప్రజాశక్తి-కుప్పం: రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన భూహక్కు చట్టాలను రద్దు చేయాలి అంటూ కుప్పం న్యాయవాదులు రోడ్డెక్కారు. ఈ సందర్భంగా వారు పట్టణంలో ర్యాలీగా బయలుదేరి తహశీల్దార రిజిస్ట్రారులకు వినతి పత్రాలను అందజేశారు. అనంతరం పట్టణంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం ఎదుట విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన భూ హక్కు చట్టాలలోని లోపాలను వివరిస్తూ, తద్వారా ప్రజలకు జరిగే నష్టాన్ని తెలియజేశారు. ముఖ్యంగా నూతన భూహక్కు చట్టం ద్వారా పేద బడుగు బలహీన వర్గాలకు చెందిన రైతుల భూములు రాజకీయ కబంధహస్తాలలో చిక్కుకొనే ప్రమాదం ఉందని హెచ్చరించారు. కావున ప్రభుత్వం వెంటనే నూతన బుహక్కు చట్టాన్ని రద్దుపరిచి, న్యాయ నిపుణులతో చర్చించి, ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టి తదుపరి భూ హక్కు చట్టాన్ని తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక న్యాయవాదులు పివి మధుసూదన్, శ్రీకాంత్, శ్రీకాంత్ సురేష్, అనిల్ కుమార్, వాసు, సుధాకర్ పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి

నివాళులర్పిస్తున్న డిఆర్ఒ

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా శుక్రవారం ఉదయం జిల్లా సచివాలయంలో ఆయన చిత్ర పటానికి డీఆర్‌వో రాజశేఖర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా వెనుకబడి తరగతుల సంక్షేమ, సాధికారత అధికారి రబ్బానీ బాషా, గృహ నిర్మాణ సంస్థ పిడి పద్మనాభం, కలెక్టర్ కార్యాలయపు ఏఓ కులశేఖర్, బిసి, గిరిజన సంక్షేమ శాఖాల సిబ్బంది తదితరులు అమరజీవి పొట్టి శ్రీరాములుకు నివాళులు అర్పించారు.

చిత్తూరుఅర్బన్: అమరజీవి పొట్టిశ్రీరాములు 71వ వర్ధంతిని పురస్కరించుకొని శుక్రవారం స్థానిక గంగినేని చెరువు వద్ద పొట్టిశ్రీరాములు విగ్రహానికి విగ్రహ స్థాపన కమిటి అధ్యక్షులు కట్టమంచి బాలకృష్ణారెడ్డి నేతృత్వంలో పలువురు ఘనంగా నివాళ్ళు అర్పించారు. కట్టమంచి బాలకృష్ణారెడ్డి, ప్రముఖ రచయిత్రి యం.ఆర్ అరుణకుమారి, లైన్స్‌క్లబ్ అధ్యక్షులు కె.వి శ్రీధర్‌రెడ్డి, బాలాజీ హేచరీస్ ఎండి.ప్రణీత్ కుమార్, కట్టమంచి మాలతమ్మ, సహదేవనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పెద్దపంజాణి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ కోసం తిండి నీరుమాని అచంచలమైన ఉద్యమ భావజాలంతో ఆమరణ నిరాహారదీక్ష చేసి తన ప్రాణాన్ని బలిదానం చేసిన గొప్ప ఉద్యమకారుడు మహా మనిషి పొట్టి శ్రీరాములు అని హెచ్ఎం బాబురెడ్డి కొనియాడారు. మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల నాగిరెడ్డిపల్లి నందు సర్దార్ వల్లభాయ్ పటేల్,పొట్టి శ్రీరాములు ల వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మీనాక్షి, రాజేష్ బాబు, ఆంజప్ప, గంగాధరం తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరులో విగ్రహానికి నివాళ్ళు అర్పిస్తున్న కవులు, కళాకారులు

‘యువగళం ముగింపు సభను జయప్రదం చేయాలి’

ప్రజాశక్తి-నగరి: తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర ఈ నెల 20న విజయనగరం జిల్లాలో ముగుస్తుందని నగరి టీడీపీ ఇన్‌ఛార్జ్ గాలి భానుప్రకాష్ అన్నారు. శుక్రవారం పార్టీ శ్రేణులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. విజయనగరంలో యువగళం పాదయాత్ర ముగింపు కార్యక్రమంలో విజయోత్సవ సభ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున విజయనగరం జిల్లాకు వెళ్ళి విజయవంతం చేయడానికి శ్రేణులు తరలిరావాలని కోరారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరిక

ప్రజాశక్తి-వెదురుకుప్పం: మండలంలోని నల్లవెంగనపల్లి పంచాయతీ తాటిమా కులపల్లికి చెందిన పలువురు వైసీపీ నాయకులు శుక్రవారం గంగాధరనెల్లూరు టీడీపీ ఇన్‌చార్జ్ డాక్టర్ థామస్ ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. సుమారు 30కుటుంబాలకు చెందిన ముస్లిం నాయకులుకు డాక్టర్ థామస్ టీడీపీ కండువా కప్పి ఆహ్వానించారు. తనపై నమ్మకంతో పార్టీలో చేరిన వారికి అండగా ఉంటానన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చిట్టిబాబు, మునిచంద్రారెడ్డి, మోహన్‌మురళి, చెంగలరాయులురెడ్డి, రాజారెడ్డి, వరప్రసాద్, బాబు నాయుడు, మహబాబుబాషా ఉన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించండి

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ అధికారి వెంకట ప్రసాద్ డాక్టర్లుకు సూచించారు. శుక్రవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం బైరెడ్డిపల్లిలో తనిఖీలు నిర్వహించారు. అడల్ట్ బిసిజి వ్యాక్సినేషన్ ఎలిజిబిలిటీ లిస్ట్ వెరిఫై చేశారు ఎక్కువ మందికి గళ్ళ పరీక్షలు చేయాలని సూచించారు. టీబీ కేసులను 15 రోజులకు ఒకసారి ఫాలోఅప్ చేయాలని తెలిపారు. ఆరోగ్యశ్రీకి సంబంధించి, అన్ని ప్రోగ్రాం గురించి ఆరా తీశారు. ఆన్లైన్ సేవలు సకాలంలో పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ విజయ్‌చందర్, డాక్టర్ శాలిని, పిపిఎం కోఆర్డినేటర్ వెంకటేశ్వర్లు, సూపర్వైజర్లు సిహెచ్‌వోలు ల్యాబ్ టెక్నీషియన్ జిలాని ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-కుప్పం: కుప్పం డిగ్రీ కళాశాలలో జరిగిన రక్తదాన శిబిరంలో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కే.డి.సిలోని రెడ్ రిబ్బన్ క్లబ్, ఎన్ ఎస్ ఎస్, లియో క్లబ్ ఆఫ్ అమిగోస్ విద్యార్థులు, హెచ్ డి ఎఫ్ సి బ్యాంకు, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వారి సారథ్యంలో ఈ శిభిరాన్ని నిర్వహించారు. స్టూడెంట్స్ క్లబ్ కార్యక్రమాల ద్వారా ఎందరికో స్ఫూర్తి నిచ్చే రక్తదానాన్ని ప్రోత్సహించడం అభినందనీయమని వైస్ చైర్మన్ సాగర్ రాజ్ విద్యార్థులను కొనియాడారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సుదారాణి మాట్లడుతూ ప్రతి విద్యార్థి ఆపదలో వున్న వారిని ఆదుకోవడం కోసం రక్త దానం చేయాలని తెలిపారు. 60 మంది విద్యార్థులు రక్తదానం చేసారని ఈ సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు డిగ్రీ విద్యార్థులతో పాటు నర్సింగ్ కళాశాల విద్యార్థినులు, అధ్యాపకులు కూడ రక్తదానం చేశారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ మెడికల్ ఆఫీసర్ విజయ్ కుమార్ రెడ్డి, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు మేనేజర్ అహీషన్ షరీఫ్, లయన్స్ క్లబ్ జోనల్ ఛైర్పర్సన్ మహేష్, కెడిసి వైస్ ప్రిన్సిపాల్ షణ్ముగం, డిసిఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ నగేష్, కెడిసి మహిళా సాధికారత కోఆర్డినేటర్ ఆశ, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

‘వీక్షిత్ భారత్’ ద్వారా విస్తృత ప్రచారం

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: వీక్షిత్ భారత్ సంకల్పయాత్రలో శుక్రవారం ఆలపల్లి పంచాయతీ పరిధిలోనీ మూగనపల్లిలో, బైరెడ్డిపల్లి పంచాయతీ పరిధిలోని శీలంపల్లి మాలలో నిర్వహించారు. ఇందులో భాగంగా ఎల్సిడి డిస్ప్లే వీడియో ద్వారా కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత గ్యాస్ పథకాలపై తెలియపరిచారు. ఎంపీడీవో రాజేంద్రబాలాజీ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

‘విద్యార్థి మేలుకో భవిష్యత్ కాపాడుకో’ గోడపత్రిక ఆవిష్కరణ

ప్రజాశక్తి చిత్తూరుఅర్బన్: విద్యార్థి మేలుకో భవిష్యత్ కాపాడుకో గోడపత్రాలను చిత్తూరు జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో చిత్తూరు నియోజకవర్గ కోఆర్డినేటర్ ఎక్స్ ఎమ్మెల్సీ దొరబాబు, నగర అధ్యక్షురాలు కటారి హేమలత చేతుల మీదుగా టిడిపి చిత్తూరు నియోజకవర్గ అధ్యక్షులు ప్రభు తేజ ఆధ్వర్యంలో విడుదల చేయడం జరిగింది. జగన్మోహన్ రెడ్డి సర్కార్ వచ్చి నాలుగున్నర సంవత్సరాలలో ఎక్కువగా విద్యార్థుల నష్టపోయారన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో విద్యారంగానికి 14శాతం నిధులు కేటాయించారన్నారు. కానీ ఈ ప్రభుత్వంలో 10 శాతం మాత్రమే కేటాయించి పదో తరగతి పాస్ పర్సంటేజ్ గత ప్రభుత్వంలో 92శాతం ఉంటే జగన్ రెడ్డి ప్రభుత్వంలో 69 శాతానికి పడిపోయిందన్నారు. టిడిపి నేతలు జగన్ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

పేకాట స్థావరంపై పోలీసుల మెరుపు దాడి

ప్రజాశక్తి -రామచంద్రాపురం: మండలంలోని బొప్పరాజు పల్లి గ్రామ సమీపంలో బుగ్గ వంక వద్ద మ్యాంగో గార్డెన్లో పేకాట స్థావరంపై తిరుపతి స్పెషల్ టీం పోలీసులు మెరుపు దాడి నిర్వహించారు. తిరుపతి జిల్లా ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు స్పెషల్ టీం పేకాట ఆడుతున్న స్థావరాన్ని రహస్యంగా తెలుసుకుని దాడి చేశారు. ఈ దాడిలో ఏడు గురు పేకాటరాయుళ్లను పట్టుకున్నారు. వారి నుండి రూ. 32 వేల రూపాయలు నగదు, మోటార్ సైకిల్, 8 సెల్ ఫోన్ లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై గిరిబాబు తెలిపారు. పేకాట ఆడుతూ పట్టుబడిన వారిపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఆర్ సి పురం పోలీసులు తెలిపారు.

కబ్జా స్థలాన్ని కాపాడండి..

తహశీల్దారుకి అఖిల పక్ష నాయకుల వినతి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పట్టణంలో కబ్జాకు గురవు తున్న స్థలాన్ని కాపాడాలని అఖిల పక్ష నాయకులు తహశీల్దారు పరమేశ్వర స్వామికి శుక్రవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలోని నంది మంగళం లెక్క దాఖలో సర్వే నంబర్.6/3.6/4.6/5.6/6 విస్తీర్ణం ఎ 3 హెక్టార్లను ప్రభుత్వం స్వాధీనం చేసుకుందని, ఈ స్థలాన్ని ప్రభుత్వం అద్దెకు, లీజుకు ఇవ్వకూడదని ప్రభుత్వ అవసరాలకు మాత్రమే ఉపయోగించాలని, కోట్ల విలువైన భూములు అక్రమాలకు గురికాకుండా సర్వే చేసి హద్దులు చూపి సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్ వెంకటేష్. టిడిపి పట్టణ అధ్యక్షులు గాలి జీవరత్నం నాయుడు, సిపిఐ పట్టణ అధ్యక్షులు డి మహేష్ పాల్గొన్నారు.

రసాయనశాస్త్రంలో మాధురికి డాక్టరేట్

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం రసాయనశాస్త్ర పరిశోధక విద్యార్థి చౌగోని మాధురికి డాక్టరేట్ ప్రదానం చేసినట్లు పరీక్షల నియంత్రణ అధికారి మూడే దామ్లా నాయక్ శు క్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రసాయనశాస్త్ర విభాగపు ఆచార్యులు జి మాధవి పర్యవేక్షణలో “డిజైన్ సింధసిస్ అండ్ క్యారెక్టరైజేషన్ ఆఫ్ నానో స్ట్రక్చర్డ్ మెటీరియల్స్ ఆస్ ఎలక్ట్రో కెమికల్ సెన్సార్ ఫర్ ద ఎనాలసిస్ ఆఫ్ బయో మోలిక్యుల్స్ అండ్ డ్రగ్స్’ అనే అంశంపై పరిశోధన గ్రంథాన్ని వర్సిటీకి సమర్పించినట్లు పేర్కొన్నారు. ఇందుకు ఆమెకు రసాయన శాస్త్ర విభాగంలో డాక్టరేట్ డిగ్రీని ప్రధానం చేశామని తెలిపారు. సి మాధురి పలు జాతీయ, అంతర్జాతీయ సదస్సులో పాల్గొని అనేక పరిశోధన పత్రాలను సమర్పించారు. ఈమె పలు జాతీయ, అంతర్జాతీయ పరిశోధనా జర్నల్స్ లలో అనేక పరిశోధనా పత్రాలను ప్రచురించారు. మాధురికి డాక్టరేట్ రావడం పట్ల రసాయన శాస్త్ర విభాగపు ఆచార్యులు, అధ్యాపకులు, పరిశోధక మిత్రులు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు అభినందనలు తెలిపారు.

బాలింతలకు కిట్లు పంపిణీ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : లయన్స్ క్లబ్ ఆఫ్ గూడూరు వైజెపి సేవా కార్యక్రమంలో భాగంగా ప్రతి నెలా గూడూరు ప్రభుత్వ ఆసుపత్రిలో బాలింతలకు శుక్రవారం కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు ఎస్ఎల్ఎన్ స్వామి మాట్లడుతూ బాలింతలు పౌష్టికాహారం తీసుకొని ఆరోగ్యంగా ఉండాలన్నారు. శిశువులకు తల్లి పాలే శ్రేష్టమని పేర్కొన్నారు. క్లబ్ సభ్యుల సహకారం మరువలేనిదన్నారు. అనంతరం ప్రాజెక్ట్ ఛైర్మన్ మురళీనాయుడు మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి దాతగా వ్యవహరించిన డెల్టా పబ్లికేషన్ సిబ్బందికి ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమం లో సభ్యులు పసుపులేటి ప్రసాద్, పైడిమర్రి రాజేంద్ర, బి పెంచలరాజు, జోన్ ఛైర్మన్ వై గురునాథం , డెల్టా పబ్లికేషన్స్ స్టాఫ్ హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు

ఉపాధి పనులపై అవగాహన

ప్రజాశక్తి- బుచ్చినాయుడు కండ్రిగ:

ఉపాధి హామీలో మేట్ల పాత్ర కీలమని ఉపాధి ఏపీఎం భానుప్రియ పేర్కొ న్నారు. మండల పరిషత్ కార్యాల యంలో మేట్లకు శుక్రవారం అవగా హన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూలీలు పని చేసే చోట మేట్లు కొలతలు వేసే విధానం, మస్టర్ వేసే విధానం. యాప్‌లు అప్‌లోడ్ చేసే విధానంపై అవగాన కల్పించారు. అంతే కాకుండా రూ.257 కూలీ వచ్చే విధంగా పనులు చేసేలా కూలీలకు అవగాన కల్పించారు. ఈ కార్యక్రమంలో టీఏ మధుసూదన్ పాల్గొన్నారు.

భవిష్యత్తు తరాలకు సీఎం జగన్ భరోసా: చెవిరెడ్డి మోహిత్ రెడ్డి

ప్రజాశక్తి- యర్రావారిపాలెం:

మండలంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న ‘ఆంధ్రప్రదేశ్ కి జగనన్న ఎందుకు కావాలి?’లో భాగంగా చివర రోజు గురువారం నెరబైలు, యర్రావారిపాలెం, ఉదయమాణిక్యం, కూరపర్తివారిపల్లి, చెరుకువారిపల్లి పంచాయతీలలో ముగింపు సభలకు హాజరైన మోహిత్ రెడ్డికి మండల నాయకులు కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఈ సందకనిర్భంగా చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి, తుడా ఛైర్మన్ మోహిత్ రెడ్డి మాట్లాడుతూ కులమత రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయని మండలం తుడా పరిధిలోకి వచ్చిన తర్వాత 40 కోట్లకు పైగా నిధులు కేటాయించి మండల అభివృద్ధికి కృషి చేశామన్నారు. గడిచిన 4 సంవత్స రాల 9 నెలల కాలంలో జగనన్న పథకాలన్ని అందుతున్నాయన్నారు. రానున్న ఎన్నికలలో జగనన్న చేసిన అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని చంద్రగిరి నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల వైసిపి నాయకులు, సర్పంచులు, ఎంపీపీ, ఎంపీటీసీలు, అధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

20న జాబ్ మేళా

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నె 20వ తేదీన ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్, జవహర్ నాలెడ్జ్ సెంటర్ (ఏకేసి) ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు జి. శ్రీనివాసులురెడ్డి తెలిపారు. ఈ జాబ్ మేళాలో 25 కు పైగా కంపెనీలు పాల్గొని అవసరమైన ఉద్యోగులను ఎంపిక చేస్తాయని, ఇంటర్, డిగ్రీ, పిజి కలిగిన అభ్యర్థులు ఈ జాబ్ మేళాలో పాల్గొన వచ్చును. ఉదయం 9.30 గంటలకు ఆసక్తి గల అభ్యర్థులు జాబ్ మేళాకు హాజరుకావాలని తెలిపారు. ఈ జాబ్ మేళాలు ఆం.ప్ర. ప్రభుత్వ యువజన పర్యాటక సాంస్కృతిక క్రీడాశాఖ మంత్రి ఆర్‌కెరోజా పాల్గొంటారని తెఇపారు. జాబ్ మేళాకు వచ్చే వారు సెల్ నంబర్లు 6300954441, 6304330520ను సంప్రదించాలన్నారు.

శ్రీవారి బ్రేక్ దర్శనాలు రద్దు : టీటీడీ

- డిసెంబరు 18న సిఫార్సు లేఖలు స్వీకరించబడవు

ప్రజాశక్తి-తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో డిసెంబరు 23 నుండి 2024 జనవరి 1వ తేదీ వరకు వైకుంఠ ద్వార దర్శనాన్ని పురస్కరించుకుని డిసెంబరు 19వ తేదీన మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా డిసెంబరు 19న బ్రేక్ దర్శనాలను టీటీడీ రద్దు చేసింది. ఈ కారణంగా డిసెంబరు 18న సోమవారం సిఫారసు లేఖలు స్వీకరించబడవు. ఈ విషయాన్ని భక్తులు గమనించాలని అధికారులు కోరారు.

రసాయనశాస్త్రంలో మాధురికి డాక్టరేట్

ప్రజాశక్తి - క్యాంపస్ :

శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం రసాయనశాస్త్ర పరిశోధక విద్యార్థి చౌగోని మాధురికి డాక్టరేట్ ప్రదానం చేసినట్లు పరీక్షల నియంత్రణ అధికారి మూడే దామ్లా నాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రసాయనశాస్త్ర విభాగపు ఆచార్యులు జి మాధవి పర్యవేక్షణలో “డిజైన్ సింధసిస్ అండ్ క్యారెక్టరైజేషన్ ఆఫ్ నానో స్ట్రక్చర్డ్ మెటీరియల్స్ ఆస్ ఎలక్ట్రో కెమికల్ సెన్సార్ ఫర్ ద ఎనాలసిస్ ఆఫ్ బయో మోలిక్యుల్స్ అండ్ డ్రగ్స్’ అనే అంశంపై పరిశోధన గ్రంథాన్ని వర్సిటీకి సమర్పించినట్లు పేర్కొన్నారు. ఇందుకు ఆమెకు రసాయన శాస్త్ర విభాగంలో డాక్టరేట్ డిగ్రీని ప్రధానం చేశామని తెలిపారు. మాధురికి డాక్టరేట్ రావడం పట్ల రసాయన శాస్త్ర విభాగపు ఆచార్యులు, అధ్యాపకులు, పరిశోధక మిత్రులు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు అభినందనలు తెలిపారు.

ఒప్పంద ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

ప్రజాశక్తి-చిన్నగొట్టిగల్లు:

విద్యాశాఖ సర్వశిక్షా అభియాన్‌లో ఒప్పంద పద్ధతిన పనిచేస్తున్న ఉద్యోగులను క్రమబద్ధీ కరించాలని స్థానిక మండల విద్యాశాఖ అధికారులు, వై సత్యనారాయణ , బి.గోపీనాథ్ లకు శుక్రవారం సమ్మె నోటీసును, వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆ ఉద్యోగులు మాట్లాడుతూ తమ సమస్యలను పరిష్కరించకపోతే డిసెంబర్ 16వ తేదీ నుంచి 19 తేది వరకు పెన్ డౌన్, డిసెంబర్ 20 నుంచి నిరవధిక సమ్మె చేపడతామని హెచ్చరించారు.

ఎంసిఆర్ పాదరక్షలు పంపిణీ

ప్రజాశక్తి-యాదమరి: మండలంలోని కుష్టు వ్యాధిగ్రస్తులకు సిహెచ్ఓ లక్ష్మీనారాయణ, డిపిఎంఓ మణిలు ఎంసిఆర్ పాదరక్షలను అందజేశారు. శు క్రవారం మండలంలోని కుష్టు వ్యాధిగ్రస్తులను యాదమరి పాఠశాల వద్దకు రప్పించి అక్కడ వారికి పాదరక్షలను అందించారు. వారు మాట్లాడుతూ సకాలంలో మందులు వాడకపోవడంతోనే కుష్టు వ్యాధిగ్రస్తులకు వైకల్యం ఏర్పడిందన్నారు. అలానే వారు నడుచుకుంటూ వెళ్లేందుకు వీలు కాదనే ఉద్దేశంతోనే వారి పాదాలకు ఎలాంటి గాయాలు ఏర్పడకుండా ఎంసిఆర్ చెప్పులను అందజేశామన్నారు. కుష్టువ్యాధి అని తెలిసిన వెంటనే మందులు వాడితే ఎలాంటి వైకల్యం లేకుండా బయటపడవచ్చన్నారు. వ్యాధిని దాచి పెట్టుకుంటే అంగవైకల్యం కూడా వస్తుందనే విషయాన్ని ప్రజలు గుర్తించుకోవాలన్నారు.

కుండల తయారీలో నైపుణ్య శిక్షణ

ప్రజాశక్తి-కుప్పం: కెవిఐసి ఆధ్వర్యంలో కుప్పం పట్టణంలోని కొత్తపేట నందు ప్రారంభించిన శిక్షణ శిబిరం శుక్రవారం నాటితో ముగిసింది. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ శాలివాహన సాధికార కమిటీ చిత్తూరు జిల్లా కన్వీనియర్ ఉదయ్ కుమార్ ఆధ్వర్యంలో ముగింపు సభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కెవిఐసిడిఆర్‌డిఓ అధికారి కృష్ణమూర్తి పాల్గొన్నారు. స్థానిక కుమ్మరి కులస్తులు ఉత్తమ నైపుణ్యాన్ని ప్రదర్శించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో కె.వి.ఐ.సి అధికారులు సిబ్బంది కుమ్మర కులస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

జాతీయ పోటీలకు విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి-నగరి: స్కూల్‌గేమ్ ఫెడరేషన్ నిర్వహిస్తున్న జాతీయ స్థాయి త్రోబాల్ పోటీలకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఏకాంబరకుప్పం విద్యార్థులు సుకన్య, నందకుమార్ ఎంపికయ్యారు. ఈ నెల 10వ తేదీ నుంచి 12వ తేదీ వరకు నంద్యాల టౌన్ కెఎన్ఎం మున్సిపల్ హైస్కూల్‌లో జరిగిన 67వ ఎస్‌జీఎఫ్ అండర్ 14 త్రోబాల్ రాష్ట్రస్థాయి పోటీలలో ఏకాంబరకుప్పం జడ్పీహెచ్ఎస్‌లో 8వ తరగతి చదివే సుకన్య, 9వ తరగతి చదివే నందకుమార్ ఉత్తమ ప్రతిభ కనభరిచారు. ఉమ్మడి జిల్లా జట్టు బాలికల విభాగంలో రెండవ స్థానము, బాలుర విభాగంలో మూడవ స్థానము సాధించగా జట్టులో ప్రతిభ కనభరచిన సుకన్య, నందకుమార్‌లు న్యూఢిల్లీలో జరగనున్న జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. శుక్రవారం విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు నమశ్శివాయం, పీడీలు మణి, కార్తికేయన్, ఉపాధ్యాయులు అభినందించారు.

ఎయిడ్స్‌పై అవగాహన ఎంతో అవసరం

ప్రజాశక్తి-కార్వేటినగరం: కౌమారదశ విద్యార్థులకు ఎయిడ్స్ పట్ల అవగాహ ఎంతో అవసరమని కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ సుబ్రమణ్యం అన్నారు. శుక్రవారం జిల్లా విద్యాశిక్షణా సంస్థ(డైట్)లో రెండు రోజుల పాటు నిర్వహించిన శిక్షణా కార్యక్రమం ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఇన్చార్జి ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులకు ఎయిడ్స్ పట్ల అవగాహన కల్పించడంతో పాటు, బాధ్యతాయుతమైన ప్రవర్తన అభివృద్ధి చెసుకునే విధంగా జీవన నైపుణ్యాలలో శిక్షణ కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. 2030 సంవత్సరంలోపల దేశంలో ఎయిడ్స్ వ్యాధి కొత్త కేసులు నమోదు కాకుండా ఎయిడ్స్ రహిత సమాజానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డైట్ ఛాత్రోపాధ్యాయులు, డైట్ అధ్యాపకులు, చిత్తూరు ఉమ్మడి జిల్లా ఉపాధ్యాయులు పలువురు పాల్గొన్నారు.

ఆత్మరక్షణకు కరాటే ఉపయోగపడుతుంది

ప్రజాశక్తి-నగరి: బాలికలకు ఆపత్కర పరిస్థితిల్లో ఆత్మరక్షణకు కరాటే లాంటి విద్యలు ఉపయోగపడుతుందని ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వేణుగోపాల్ అన్నారు. శుక్రవారం మహిళా సాధికార సంస్థ ఆధ్వర్యంలో ఆత్మరక్షణలో శిక్షణ కార్యక్రమం ఏర్పాటుచేశారు. కరాటే మాస్టర్ గోపి బాలికలు ఏవిధంగా ఆపత్కర పరిస్థితులలో ఆత్మరక్షణ చేసుకోవాలనే అంశంపై డెమో నిర్వహించి శిక్షణ అందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో దూసుకుపోతున్నారన్నారు. విజయాలు సాధించా లంటే ఆత్మవిశ్వాసం పెంపొందించుకోవాలన్నారు. కరాటే లాంటి విద్యలు నేర్చుకోవడం వల్ల ఆకతాయిలకు బుద్ధిచెప్పవచ్చన్నారు. మహిళా సాధికారత విభాగం అధ్యక్షురాలు డాక్టర్ ఎ.ఇందిరాప్రియదర్శిని మాట్లాడుతూ అమ్మాయి లపై అఘాయిత్యాలను అరికట్టాలంటే తమంతటతాముగా శిక్షణ పొందడం అవసరమన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ ఎం.అరుణకుమారి, డాక్టర్ సుహాసిని, ప్రేమ్‌కుమార్ (పీడీ), విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళ దారుణ హత్య

ప్రజాశక్తి-గంగవరం: మహిళ దారుణహత్యకు గురైన సంఘటన శు క్రవారం స్థానిక సిండికేట్ బ్యాంకు సమీపంలో చోటు చేసుకున్నది. స్థానికులు కథనం మేరకు.. అనం తపురం నుంచి బ్రతుకుతెరువు కోసం వచ్చిన లక్ష్మి(40) చెత్త కాగితాలు, ప్లాస్టిక్ బాటిళ్లు సేకరించి వచ్చిన దాంతో జీవనం సాగిస్తున్నట్లు చెప్పారు. కాగా గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు బండరాళ్లతో మోది హత్య చేసినట్లు పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని పలమనేరు ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి తెలిపారు.